క్లుప్తంగా

చేగుంటలో ఒలింపిక్ డే టూకే రన్



ఒలింపిక్ డే టూకే రన్ ప్రారంభిస్తున్న ఎస్ఐ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో సోమవారం ఒలింపిక్ డే టూకే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి వడియారం బస్టాండ్ వరకు టూకే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఒలింపిక్స్ అనేవి స్నేహం, సౌభ్రాతత్వానికి చిహ్నంగా భావిస్తారని అన్నారు. ఒలింపిక్స్ మెరుగైన ప్రపంచాన్ని సైతం నిర్మించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంఈఓ నీరజ, ఒలంపిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణేష్‌రవికుమార్, పీడీ శారద, నాయకులు పరంజ్యోతి, ఆయా గ్రామాల పీఈటీలు విద్యార్థులు యువకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

టేక్మాల్(మెదక్): నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం టేక్మాల్ రైతువేదికలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర ఆదేశాల మేరకు రూ.15 లక్షల విలువ గల 41చెక్కులను అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో పేదలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, టేక్మాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భక్తుల కిషోర్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటి నీరుపోస్తున్న మహిళలు

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అంగన్‌వాడీ టీచర్ అసూరి సరళ అన్నారు. సోమవారం స్థానిక పూసలగల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లులతో కలిసి మొక్కలను నాటారు. మొక్కలు నాటి వాటని సంరక్షించాలని, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఇంటింటికీ మొక్కలను అందజేస్తుందని చెప్పారు.

పేదల సంక్షేమానికి కేంద్రం



చిలప్‌చెడ్‌లో బీజేపీ రచ్చబండ కార్యక్రమం

చిలప్‌చెడ్(నర్సాపూర్): పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మండల బీజేపీ అధ్యక్షుడు నగేశ్ పేర్కొన్నారు. చిలప్‌చెడ్, శిలాంపల్లి గ్రామాలలో ప్రధాని నరేంద్రమోదీ 11ఏళ్లపాలన పూర్తయిన సందర్భంగా సోమవారం గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమం కోసం నిరంతర కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, రామకృష్ణ, రాజాగౌడ్, చంద్రారెడ్డి, సాయిప్రవీణ్, ప్రశాంత్, దశరథ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కూతురితో ఇందిరమ్మ ఇంటి భూమిపూజ



కౌడిపల్లి: ధర్మాసాగర్‌గేట్‌తండాలో కూతురితో భూమిపూజ చేయిస్తున్న తండ్రి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌గేట్‌తండాలో భర్మావత్ జీవన్‌కు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో సోమవారం పంచాయతీ కార్యదర్శి సిరాజొద్దీన్, అధికారులు, తండావాసులు ముగ్గువేశారు. అనంతరం తన కూతురితో భూమిపూజ చేయించి పనులు ప్రారంభించారు.

మెరుగైన వైద్యం అందించాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. సోమవారం ఆమె ఆస్పత్రి సలహా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించి, అవసరమైన మందులు ఇవ్వాలని, డెలివరీలు పెంచాలని, తప్పనిసరి పరిస్థితులలోనే ఇతర ఆస్పత్రులకు రోగులను పంపాలని వైద్యులకు సూచించారు. కాగా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి వెళ్లిన వైద్యులు, ఇతర సిబ్బంది డిప్యూటేషన్ రద్దు చేయించి, ఇక్కడే వారు విధులు నిర్వర్తించేలా చేస్తానన్నారు. అలాగే ఖాళీల భర్తీకి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమీక్ష అనంతరం ఎమ్మెల్యే ఆయా వార్డులలో తిరిగి రోగులతో మాట్లాడారు.

మంచితనానికి మారుపేరు శ్రీనివాస్



శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, ఇతర నాయకులు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నర్సాపూర్ రూరల్: మంచితనానికి మారుపేరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ అని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కొనియాడారు. సోమవారం మండలంలోని చిప్పల్‌తుర్తిలో మాజీ సర్పంచ్ దుప్తల శ్రీనివాస్ విగ్రహాన్ని జక్కపల్లి చౌరస్తా వద్ద ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సంతాప సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అందరి హృదయాల్లో పేరు సంపాదించుకోవడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో మాజీ లేబర్ వెల్ఫేర్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, శేఖర్, బిక్షపతి, జితేందర్‌రెడ్డి, సత్యంగౌడ్, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జగన్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ శ్రీనివాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిధులు మంజూరు చేయండి

పాపన్నపేట(మెదక్): జిల్లాలో రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్సింగి నుంచి వయా కొంపల్లి, పెద్దశంకరంపేట రోడ్డు వెడల్పు, మరమ్మతులు, కొడుపాక, పాపన్నపేట రోడ్డు వెడల్పు కోసం నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరినట్లు చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు నవీన్ గౌడ్, కిష్టయ్య, తిరుపతి రెడ్డి, వెంకటేశం, చైర్మన్ దత్తు ఉన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ దినకర్, పశువైద్యాధికారి గీతామాలిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, సంధ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరం

ఎంపీడీఓ సీతారావమ్మ



రేగోడ్: గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సీతారావమ్మ

రేగోడ్(మెదక్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల పాలిట వరమని ఎంపీడీఓ సీతారావమ్మ అన్నారు. మండలంలోని జగిర్యాల, కొండాపూర్, సంగమేశ్వర, పెద్దతండాలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులంతా తొందరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫిరోజ్, ఉపాధి హామీ పథకం ఈసీ జగదీశ్, క్షేత్ర సహాయకుడు దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మల్కాపూర్, కట్టెల వెంకటాపూర్, మాడ్చెట్‌పల్లితో పాటు ఆయా తండాలలో హౌసింగ్ ఏఈ ప్రియ ఇందిరమ్మ ఇళ్ల పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు తమ ఇళ్ల పనులను వెంటనే పూర్తిచేస్తే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వెల్దుర్తి(తూప్రాన్): మాదకద్రవ్యాల బారిన పడితే జీవితాలు నాశనం అవుతాయని ఎస్సై రాజు అన్నారు. సోమవారం సాయంత్రం గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..యువత భవిష్యత్తు బాగుండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరూ డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మృతదేహం గుర్తింపు



బాల్యనాయక్ మృతదేహం

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్ గ్రామశివారులో లభ్యమైన మృతదేహానికి సంబంధించి వివరాలు తెలిశాయని సోమవారం పోలీసులు తెలిపారు. మృతుడు వనపర్తి జిల్లా దత్తయ్యపల్లి పెద్దతండాకు చెందిన బాల్య నాయక్ (60)గా గుర్తించారు. మతిస్థిమితం సరిగా లేని అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత ఇంటికి వచ్చేవాడని తెలిపారు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన లక్ష్మాపూర్‌లో మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. వారు మృతుడి వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కమిషనర్, సీఐ తదితరులు

సీఐ రంగాకృష్ణ

తూప్రాన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఐ రంగాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘం, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కట్టపైన మొక్కలను మున్సిపల్ కమిషనర్ గణేషరెడ్డి, సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నవి మొక్కలు మాత్రమేనని వీటి ద్వారా స్వచ్ఛమైన ఆక్సిజన్, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా మంచి బాటలో నడవాలని, పర్యావరణం కోసం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పోలీస్‌శాఖ అధికారులు, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం



కౌడిపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని మర్రిచెట్టుతండాలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆధార్, రేషన్‌కార్డు ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ పుణ్యదాస్, ఎస్టీహాస్టల్ వార్డన్ జయరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఈఓ సృజన, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, వైద్యసిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి



బ్యాగులు అందజేస్తున్న ఎంఈఓ బుచ్చనాయక్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఫ్లెమింగ్ పరిశ్రమ కృషి చేస్తోందని చీఫ్ ఆపరేటింగ్ అధికారి రాంకుమార్ అన్నారు. మండల పరిధి నవాబుపేట లోని ఫ్లెమింగ్ లాబొరేటిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో సోమవారం మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లోని 112 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందించారు. అందివ్వడంతో పాటు నవాబుపేట యూపీఎస్ పాఠశాలకు రెండు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. ఎంఈఓ బుచ్చనాయక్ కంప్యూటర్లను ప్రారంభించి మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయి ఎదగాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ఆర్ రాజేంద్ర, హెచ్ఎం బాబా తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరిన ప్రజలు

దరఖాస్తులతో బారులు

హవేళిఘణాపూర్(మెదక్): భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోలేని రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి బారులు తీరారు. అధికారులు సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించారు. గతంలో రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తహసీల్దార్ సింధూరేణుక తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎంపీడీఓ ఆనంద్

చిన్నశంకరంపేట(మెదక్): మార్కింగ్ చేసిన విధంగానే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ కోరారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నింబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం నాణ్యతగా చేపట్టాలన్నారు. బేస్‌మెంట్ పూర్తయిన వెంటనే రూ. లక్ష బిల్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమకానుందన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, రాజేష్, మైసయ్య పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరి



యాదగిరికి నియామకపత్రం అందజేస్తున్న దేవయ్య

రామాయంపేట(మెదక్): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామాయంపేటకు చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దేమె యాదగిరి ఎన్నికయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు బట్టి జగపతి, తదితరులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



మొక్కలు నాటుతున్న జగన్నాథ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి జగన్నాథ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పిలుపు మేరకు గ్రామంలో మొక్కలను నాటారు.

ఆశయాలకు అనుగుణంగా పాలన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా నేడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు. సోమవారం శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, అంజిరెడ్డి, రాజేశ్వర్ రావు దేశ్ పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రైతు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి**

శివ్వంపేట(నర్సాపూర్): రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని నర్సాపూర్ సహాయ వ్యవసాయ ఇన్‌చార్జి సంచాలకులు గంగమల్లు అన్నారు. సోమవారం శివ్వంపేట రైతు వేదికలో నర్సాపూర్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బంది, ఆత్మ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం కిసాన్ కు సంబంధించి ఈకేవైసీ పూర్తి చేయడంతో పాటు పథకాల గురించి వివరించాల్సిందిగా సూచించారు. శివ్వంపేట, నర్సాపూర్, తూప్రాన్, మనోహరాబాదు మండలాల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సిటీ స్కాన్ ఏర్పాటు చేయండి**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ స్కాన్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు దుర్గప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ప్రభుత్వ ఆస్పత్రి ఉందని, ప్రతి రోజు పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారని చెప్పారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్‌లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. డయాలసిస్ మిషన్‌లు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. సిటీ స్కాన్‌తో పాటు మరో డయాలసిస్ మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

◆ **చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం**

నారాయణఖేడ్: ఖేడ్ మండలం వెంకటాపూర్ చౌక్ సమీపంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం, మహాహారతి, పుష్పాభిషేకం, పుష్పార్చన, గీతాపారాయణం, హనుమాన్ చాలీసా, లలితాసహస్ర నామావళి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. గీత నేర్చుకో తలరాత మార్చుకో కార్యక్రమంలో భాగంగా ప్రధాన అర్చకుడికి శివశక్తి జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ శ్రీనివాస్ భగవత్‌గీత పుస్తకాన్ని బహూకరించారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

మునిపల్లి(అందోల్): మునిపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లోడి సతీష్ సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రూ. 10.50 లక్షలు మంజూరయ్యాయి. మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

◆ **అభివృద్ధికి నిధులు ఇవ్వండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కార్పొరేటర్ పుష్ప మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామచంద్రాపురం పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరారు.

◆ **నేడు డయల్ యువర్ డీఎం**

జహీరాబాద్: డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు జహీరాబాద్ ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్ టీ.స్వామి తెలిపారు. సా. 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, సందేహాలు తమ దృష్టికి తేవాలని పేర్కొన్నారు. అంతేకాకుండా సూచనలు, సలహాలు కూడా ఇవ్వవచ్చన్నారు. ఇందుకు 9959226268 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

◆ **నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు**

సదాశివపేట రూరల్,(సంగారెడ్డి): ఇళ్లు లేని ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం అందిస్తోందని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంకేనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు దేశానికి ఆదర్శమన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలను కేటాయించడం దేశంలో మరెక్కడా లేదన్నారు. అర్హులందరికీ విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు.

◆ **కార్మిక చట్టాలపై అవగాహన**

సంగారెడ్డి: కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధు మదన్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లలో పని చేస్తున్న గృహ కార్మికులకు నాయకత్వ లక్షణాలు, గృహహింస, కార్మిక హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోటి వారి సమస్యలను తమ సమస్యలుగా భావించి స్పందించాలని, అవసరమైన సహాయం అందించాలన్నారు. డొమెస్టిక్ వర్కర్స్, నాయకులు పాల్గొన్నారు.